శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతా

మైలార్‌దేవ్‌పల్లి సీఐ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 1: శాంతిభద్రతలను కాపాడేందుకు పాటుపడుతానని, ఇందుకు ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ సీఐ పి.నరేందర్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి సీఐగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ పి.మధు సైబరాబాద్ క్రైమ్ పీఎస్‌కు సీఐగా బదిలీ అయ్యారు. సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న నరేందర్‌ను మైలార్‌దేవ్‌పల్లి సీఐగా బాధ్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దుకాణాలను రాత్రి 10 గంటలలోపు మూసివేయాలన్నారు. అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

బండ్లగూడ, జూలై 1: దొంగతనం కేసులో రాజేంద్రనగర్ కోర్టు ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు ఇద్దరికి కలిపి రూ.వెయ్యి జరిమానా విధించింది. కాటేదాన్‌కు చెందిన సుమిత్ అలియస్ సోనూసింగ్, సికింద్రాబాద్‌కు చెందిన మహ్మద్ జంగీర్ ఆర్జీఐ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో అరెస్ట్ అయ్యారు. వారికి సోమవారం రాజేంద్రగర్ 12ఎంఎం కోర్టులో జడ్జి ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

బండ్లగూడ, జూలై 1: చాయ్ తాగేందుకు వచ్చిన ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్రా మిరెడ్డి వివరాల ప్రకారం.. అత్తాపూర్ పిల్లర్ నంబర్ 245 వద్ద నబి అనే యువకుడు టీ తాగుతుండగా అటుగా వచ్చిన సల్మాన్ పొరపాటున అతనికి తగిలాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కోపోద్రిక్తుడైన సల్మాన్ అతని ఇంట్లో నుంచి కత్తి తీసుకువచ్చి నబీపై దాడి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన నబీని ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వైద్యుల సేవలు మరువలేనివి

● ఘనంగా వైద్యుల దినోత్సవ వేడుకలు

శంషాబాద్ రూరల్, జూలై 1: వైద్యుల సేవలు గొప్పవని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి తెలిపారు. సోమవారం జాతీయ డాక్టర్ డే సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ దవాఖానల్లో పని చేస్తున్న వైద్యులను సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుల సేవలు మరువలేనివని గుర్తు చేశారు. ప్రజలకు సేవలందిస్తున్న వైద్యులు భగవంతుడితో సమానమని కొనయడారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్యతో పాటు పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యురాలిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, తదితరులు

వైద్య వృత్తి పవిత్రమైనది

జూబ్లీహిల్స్: వైద్య వృత్తి పవిత్రమైనదని శ్రీరాంనగర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అనురాధ అన్నారు. వైద్యులతో పాటు సిబ్బంది ఆపదలో ఆదుకునే దేవుళ్లతో సమానమని అన్నారు. సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా శ్రీరాంనగర్ క్లస్టర్ కార్యాలయంలో వైద్యుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసిన అనంతరం డాక్టర్ బీసీ రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని పీహెచ్‌సీల, బస్తీ దవాఖానల మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది డాక్టర్ అనురాధకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో ఘనంగా సన్మానించారు.

ఎస్సీహెచ్‌ఓ అనురాధను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

వైద్యులను సత్కరిస్తున్న రాజ్‌కుమార్, వీణామాధురి

ప్రభుత్వ వైద్యులకు సత్కారం

ఖైరతాబాద్: ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులను సత్కరించారు. గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, సభ్యురాలు వీణా మాధురి వైద్యులకు పూలబొకే, శాలువాను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐయూ నేతలు

ఖైరతాబాద్, జూలై 1: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వనం సుధాకర్ మాట్లాడుతూ, నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని, యూపీఏ వంటి నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు. జాతీయ ఎన్నికల కమిషన్‌లో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను చేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాత వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. అటవీ సవరణ చట్టం 2022ను వెనక్కి తీసుకోవాలని, వైజాగ్ స్టీల్ లాంటి ప్రభుత్వ రంగ పరిశ్రమల విక్రయాన్ని మానుకోవాలన్నారు. ప్రతి కార్మికుడికి నెలకు రూ.30 వేల కనీసం వేతనం అమలు చేయాలన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. నిజామాబాద్‌లోని బోధన్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాగ్యమ్మ, మల్లేశ్, నర్సింహా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యలను పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, జూలై 1: బోనాల ఉత్సవాల నేపథ్యంలో బస్తీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గాంధీకుటీర్ బస్తీ కమిటీ ప్రతినిధుల బృందం సోమవారం నారాయణగూడలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బస్తీలో ఉన్న బోరువెల్‌కు మరమ్మతులు, వీధుల్లోని రోడ్లు, లైటింగ్ వంటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ అధ్యక్షుడు తోట శివకుమార్, సభ్యులు కిరణ్‌గౌడ్, శ్రీనివాస్, సీతారాములు, కాంగ్రెస్ నేతలు జి.రామన్‌గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ మహాలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గండిపేట మండల ఉపాధ్యాయులు

మణికొండ, జూలై 1: రంగారెడ్డి జిల్లాలో పని చేస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని గండిపేట మండల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 317 జీవో అమలుతో స్థానికులమై తాము పదోన్నతులను కోల్పోయి మనోవేదనకు గురవుతున్నామని పేర్కొన్నారు. సేవ్ రంగారెడ్డి అనే నినాదంతో సోమవారం గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు రాజేంద్రనగర్ మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్‌కు గండిపేట మండల ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేశారు. ఈసందర్భంగా టీచర్లు మాట్లాడుతూ రంగారెడ్డిలో కలిపింది 10 మండలాలైతే మహబూబ్‌నగర్ ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు, బదిలీల్లో అవకాశం ఇచ్చారని చెప్పారు. స్థానికేతరులకు 96 శాతం, స్థానికులకు మాత్రం నాలుగు శాతం మాత్రమే ప్రమోషన్లు ఇచ్చారన్నారు. న్యాయంగా తమకు రావాల్సిన పదోన్నతులు, బదిలీల్లో అన్యాయం జరిగిందన్నారు. 317 జీవో ద్వారా వచ్చిన ఉపాధాయ్యులను స్థానిక రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల కంటే జూనియర్లుగా పరిగణించి వారికి జీరో సర్వీస్ చేయాలన్నారు. దీని వల్ల రంగారెడ్డి జిల్లా స్థానిక గురువులు సీనియార్టీని కోల్పోయి తీవ్రమైన మనోవేదనకు, నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారన్నారు. మానవతా దృక్పథంతో రంగారెడ్డి జిల్లా స్థానిక ఉపాధాయ్యులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్ మాట్లాడుతూ 317 జీవో ద్వారా స్థానిక ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతున్న వాస్తవమేనన్నారు. ఈ విషాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెవెళ్లి సమస్య పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

అధిక డొనేషన్ల వసూలుపై చర్యలు తీసుకోండి

హిమాయత్‌నగర్, జూలై 1: రాష్ట్రంలో అధిక డొనేషన్లు వసూలు చేసే అటానమస్ ఇంజినీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అడ్మిషన్, రెగ్యులేటరీ కమిటీ చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డికి సోమవారం ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) ప్రతినిధిబృందం కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా యూనియన్ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ అటానమస్ పేరుతో రూ.1లక్ష నుంచి రూ.26లక్షల వరకు పలు కోర్సులకు మేనేజ్‌మెంట్ కోటా కింద డొనేషన్లతో అక్రమంగా విద్యార్థుల నుంచి కాలేజీల యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోవడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో జరిగే అడ్మిషన్లపై పూర్తిస్థాయిలో నిఘాపెట్టి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అన్ని అవకతవకలే

ఖైరతాబాద్, జూలై 1: ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ లోపభుయిష్టంగా ఉందని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రశేఖర్‌గౌడ్, బీసీ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు దేశబోయిన రమ ఒక ప్రకటనలో ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు తెలంగాణలో ప్రతి పంచాయతీకి ఒక పాఠశాల ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల్లో అప్రకటిత రేషనలైజేషన్ చేసినట్లు తమకు అనుమానం కలుగుతుందన్నారు. వెబ్ కౌన్సెలింగ్‌లో మొత్తం ఖాళీలను చూపించడం లేదన్నారు. ఇలాంటి చర్యల వల్ల డీఎస్సీలో కూడా పోస్టులు తగ్గుతాయని, నిరుద్యోగులు నష్టపోతారన్నారు. తక్షణమే ఈ ప్రక్రియను సరిచేయాలని, ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'ఆమె' ఆరోగ్యమే లక్ష్యంగా 5కే రన్


రన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ఖైరతాబాద్, జూలై 1: మహిళల ఆరోగ్యం, ప్రకృతి, జీవనశైలీపై అవగాహన పెంపొందించేందుకు అమ్మని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద 5కే రన్‌ను ఏర్పాటు చేశారు. ఈ రన్‌ను ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమ్మని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఆమని, ఉపాధ్యక్షురాలు భారతి, కోశాధికారి యమున, సహాయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, జూలై 1: విద్యార్థులు లక్ష్యాన్ని సాధించేందుకు నిర్విరామంగా శ్రమించాలని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మైనార్టీ పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ చంద్రశేఖర్‌తో కలిసి యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు సయ్యద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు సోషియో ఎకనామిక్ ప్రొఫైలింగ్

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్

జూబ్లీహిల్స్, జూలై 1: వీధి వ్యాపారులకు సోషియో ఎకనామిక్ ప్రొఫైలింగ్ పకడ్బందీగా చేపట్టాలని, తద్వారా ఇన్సూరెన్స్ పథకాలు అన్నీ వారికి వర్తింపచేయాలని 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో వీధి వ్యాపారులకు స్వానిధి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యూసీడీ డీపీఓ వెంకటకిషన్ రావు, పౌర సరఫరాల, కార్మిక శాఖ అధికారులు, బ్యాంకర్లు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

14న మధురానగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

ఎర్రగడ్డ, జూలై 1: బోరబండ డివిజన్ మధురానగర్ బస్తీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సంక్షేమ సంఘం ఎన్నికలను ఈనెల 14న నిర్వహించటానికి బస్తీలోని ఇండ్ల యజమానుల సమక్షంలో నిర్ణయించారు. ఎన్నికల అధికారిని నియమించుకొని త్వరలో ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్లు బస్తీ నేత ఆనంద్ కుమార్ చెప్పారు. ఎన్నికలు శాంతి యుతంగా జరిగేందుకు స్థానికులు సహకరించాలని కోరారు.

పంజాగుట్టలో నేడు, రేపు జాబ్‌మేళా

జూబ్లీహిల్స్, జూలై 1: భారత్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నేడు, రేపు పంజాగుట్ట ద్వారకాపురికాలనీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, పీజీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు జాబ్‌మేళాకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9959363083లో సంప్రదించాలని.. ఇంటర్వ్యూలకు హాజరుకాలేని అభ్యర్థులు ఈ వాట్సప్ నంబర్‌లో బయోడాటాను పంపించాలని కోరారు.

అధ్యయనం ఆవిష్కరణ

జూబ్లీహిల్స్, జూలై 1: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో 'భారతీయ మసాలా పరిశ్రమ సవాళ్లు వ్యవసాయ పరిష్కారాలు' అంశంపై ఓఎఫ్‌జీఏ పేరుతో నిర్వహించిన అధ్యయనంతో సేఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు పీఎస్‌ఆర్వీఎస్ విఠల్ రచించిన పుస్తకాన్ని యూసుఫ్‌గూడలోని నిమ్స్ మేలో డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరి స్వరూప, సీవైఐఈఎన్టీ ఫౌండర్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

వేడుకలకు నిధులివ్వాలి

ఖైరతాబాద్: బోనాల పండుగ నిర్వహణకు నిధులు కేటాయించాలని కోరుతూ ఖైరతాబాద్ మహాంకాళి దేవస్థానం చైర్మన్ భవానీ కృష్ణ యాదవ్, అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ ఎమ్మెల్యే నాగేందర్‌కు విజ్ఞప్తి చేశారు.

హిజ్రాల పట్ల వివక్షలేని సమాజాన్ని నిర్మించాలి

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సోని

హిమాయత్‌నగర్, జూలై 1: తమ పట్ల వివక్షలేని సమాజాన్ని నిర్మించాల్సి ఉందని పలువురు హిజ్రాలు తెలిపారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హిజ్రాలు సోని, సల్మా, జాస్మిన్ మాట్లాడుతూ.. తమ పట్ల, సంస్కృతిపై చిన్నచూపు చూపుతున్నారన్నారు. తమపై హింసను కట్టడి చేసేందుకు భాగ్యనగర్ హిజ్రా చాటాయి సంస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాచీనా హిజ్రా విధి, విధానాలు, ఆచార వ్యవహారాలకు అనుగుణంగానే సంస్థ పనిచేస్తుందని తెలిపారు. హిజ్రాల సంపూర్ణాభివృద్ధికి చొరవ తీసుకుంటామని వివరించారు. ఈ సమావేశంలో హిజ్రాలు మనోరమ, గంగ, రచన పాల్గొన్నారు.

అమర్‌నాథ్ యాత్రకు బయల్దేరిన భక్తులు


యాత్రకు బయల్దేరుతున్న ధర్మకర్తలను సన్మానించిన ఆలయ కమిటీ

ఎర్రగడ్డ, జూలై 1: బోరబండకు చెందిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ ధర్మకర్తలు అమర్‌నాథ్ యాత్రకు బయల్దేరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో యాత్రకు బయల్దేరుతున్న సోమేశ్, బాలకృష్ణ, తివారి, సురేశ్‌శర్మ, నాగరాజును ఆలయ ప్రాంగణంలో సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కమిటీకి చెందిన లక్ష్మణ్‌గౌడ్‌తో పాటు సత్యనారాయణ, ప్రవీణ్, గోవింద తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పునకు సాహిత్యం

హిమాయత్‌నగర్, జూలై 1: సమాజంలో విలువలను పెంచేందుకు సాహిత్యం సాధనం వంటిదని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, కవి, విమర్శకుడు డాక్టర్ బిక్కి కృష్ణ, కవులు డాక్టర్ జెల్ది విద్యాధర్, శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహర్షివాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ, భారతీయ సాహిత్య అనువాధ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ 86వ జన్మదినం సందర్భంగా 'ఇనాక్ సాహిత్యం, సమాలోచన' అంశంపై సోమవారం నారాయణగూడలోని తాజ్ మహల్ హోటల్‌లో కవి సమ్మేళనం జరిగింది. కవి, రచయిత డాక్టర్ వీడీ రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యంలో దశాబ్దాలకుపైగా కొలకలూరి ఇనాక్ ఎనలేని సేవలు అందించారని అన్నారు. ఆయన రచనలన్నీ మానవీయకోణంలో ఆవిష్కృతమైనవని తెలిపారు. ఇనాక్ జీవితమంతా సమాజానికి సాహిత్యాన్ని అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రచయితలు డాక్టర్ భారతి, డాక్టర్.రాధాకుసుమ, ప్రతినిధులు రవీంద్ర బాబు, పద్మశ్రీలత, కృష్ణారెడ్డి, శైలజ, గోగు వెంకటేశ్వర్లు, కళా మురళి, ధనలక్ష్మి, రామలక్ష్మి, పద్మావతి, మధుజ్యోతి, ఆనందరావు, లలిత, శేఖర్ పాల్గొన్నారు.

కవులకు సత్కారం చేస్తున్న కొలకలూరి ఇనాక్

వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్ షురూ..

క్లినిక్‌ను ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, జూలై 1: నిమ్స్ దవాఖానలో నూతనంగా ఏర్పాటు చేసిన వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్‌ను సోమవారం డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నవల్ చంద్రతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ అంటువ్యాధులను నివారించడంలో ఇమ్యూనైజేషన్ ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు ఈ క్లినిక్ దోహదపడుతుందన్నారు. రోగ నిరోదధక వ్యవస్థ మార్పులు, అనారోగ్యం బారిన పడిన వారికి ఉపశమనం కల్పించేందుకు ఈ టీకాలను వినియోగించుకోవచ్చన్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు ఏటా 25 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయని, ఈ క్లినిక్ సాయంతో అంటు వ్యాధులను గుర్తించి టీకా సాయంతో పూర్తిగా నయం చేయవచ్చన్నారు. వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్ సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటీవ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, జనరల్ మెడిసిన్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ రాజు, డాక్టర్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో తొలి కేసు

వెంగళరావునగర్, జూలై 1: దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కొత్త నేర, న్యాయ చట్టాల కింద మధురానగర్ పోలీసు స్టేషన్‌లో తొలికేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ రెడ్డి కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌కు చెందిన వ్యాపారి ఎన్.రవిరాజు(38) సోమవారం తెల్లవారుజామున అమీర్‌పేట సత్యం థియేటర్ నుంచి జూబ్లీహిల్స్ వైపు కారులో వెళ్తున్నాడు. మైత్రీవనం సిగ్నల్ దాటుతుండగా పంజాగుట్ట వైపు నుంచి వచ్చిన కారు అతివేగంతో దూసుకొచ్చి వీరి కారును ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్త చట్టాల కింద సెక్షన్ 281 భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), 184 ఎంవీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్‌ను డిజిటల్‌గా నమోదు చేశారు.

ఉరివేసుకొని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, జూలై 1: ఉరేసుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని సిద్ధాంతి బస్తీకి చెందిన పల్లెమోని విష్ణు(38) మృతి చెందినట్టు సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. విష్ణుకు సోదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కట్ట ధ్వంసం.. వ్యక్తిపై కేసు

శంషాబాద్ రూరల్, జూలై 1: చెరువు కట్టను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం మండలంలోని పాలమాకుల సర్వే నంబర్ 84లోని ఎర్రకుంట చెరువు పరిశీలనకు ఇరిగేషన్ ఏఈ మౌనిక వెళ్లారు. అయితే చెరువు కట్టను అదే గ్రామానికి చెందిన మహేశ్వర్‌యాదవ్ తనకు ఇష్టం వచ్చినట్లు ధ్వంసం చేయడమే కాకుండా మట్టిని ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇరిగేషన్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పనులు పూర్తిచేస్తాం

జూబ్లీహిల్స్, జూలై 1: పెండింగ్ పనుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. సోమవారం కార్మికనగర్ సువర్ణ కిరాణా స్టోర్ వద్ద చేపడుతున్న పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.